ప్రజాశక్తి
శుక్రవారం 8 మార్చి, 2024
5
శ్రీకాకుళం

నేడు మహిళా దినోత్సవం

శ్రీకాకుళం : 'స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే సృష్టే లేదు' 1908 సంవత్సరం మార్చి 8వ తేదీన అమెరికాలో మహిళలు తమకు ఉద్యోగాల్లో సమాన అవకాశాలు, వేతనాలు కావాలన్న డిమాండ్‌తో భారీ నిరసన చేపట్టారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఈ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ధాన్యం బకాయిలు రూ.156 కోట్లు

బూర్జ మండలంలో అల్లెనలో ధాన్యం బస్తాలను లోడ్ చేస్తున్న రైతులు

- నెల రోజులు దాటుతున్నా అందని డబ్బులు
- ఖరీఫ్‌లో పంట ఖర్చులకు అప్పులు చేసిన అన్నదాతలు
- వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు
- రబీ సాగుకు సొమ్ముల్లేక ఇబ్బందులు పడుతున్న రైతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావించారు. ప్రభుత్వం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 99,001 మంది రైతుల నుంచి 4,45,884 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. వీటి విలువ రూ.973.98 కోట్లుగా ఉంది. వీటిలో ఇప్పటివరకు రూ.803.92 కోట్లను చెల్లించారు. ఇంకా రూ.156.73 కోట్ల మేర రైతులకు చెల్లించాల్సి ఉంది. అధిక శాతం మంది రైతులకు నెల రోజులకు పైగా బకాయిలు ఉన్నాయి. మరికొంత మందికి 40 నుంచి 50 రోజులు పాటు పెండింగ్‌లో ఉన్నాయి.

డబ్బులు జమ కాక రైతులు ఇబ్బందులు

ఆరుగాలం చెమటోడ్చి పండించిన ధాన్యం అమ్మినా డబ్బులు అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం 21 రోజుల్లో డబ్బులు చెల్లించాల్సి ఉంది. నెల రోజులు దాటుతున్నా నగదు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం బకాయిలు డబ్బులు సకాలంలో అందకపోవడంతో రబీసాగు ఖర్చులకు చేతిలో డబ్బులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్న అప్పు తీర్చే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డులను జారీ చేయకపోవడంతో తెలిసిన రైతులతో తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చారు. సకాలంలో డబ్బులు జమ కాక వారూ ఇబ్బందులు చవిచూస్తున్నారు

ఈ సారి కొనుగోలు ఐదు లక్షల టన్నుల లోపే

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చివరి దశకు వచ్చాయి. జిల్లాలో ఇప్పటివరకు 4,45,481 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో సాధారణ రకం ధాన్యం 4,45, 197 టన్నులు కాగా, గ్రేడ్-ఎ రకం 284 మెట్రిక్ టన్నులు ఉంది. జిల్లాలో పండగ సీజన్ ముందు వరకు ధాన్యం కొనుగోలు చాలా జోరుగా సాగాయి. ఆ తర్వాత మందగించాయి. ఆమదాలవలస, నరసన్నపేట, పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తదితర మండలాల్లో ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా జరగలేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొనడంతో ఈసారి పంట పెద్దగా లేకపోవడంతో అక్కడా కొనుగోలు పూర్తయ్యాయి. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో అనుకున్నంత మేర ధాన్యం రాలేదు. దీంతో 5.40 లక్షల మెట్రిక్ టన్నులను కొనాలని అధికారులు భావించినా ఐదు లక్షల మెట్రిక్ టన్నులోపే పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

సోంపేట మండలం మాకన్నపురానికి చెందిన కె.సావిత్రి అనే రైతు తాను పండించిన 35 బస్తాలను జనవరి 23వ తేదీన మాకన్నపురం ఆర్‌బికెకు ఇచ్చారు. ఆమెకు ప్రభుత్వం నుంచి రూ.61,110లు రావాల్సి ఉంది. ధాన్యం ఇచ్చి సుమారు 45 రోజులు గడచినా నేటికీ ఖాతాలో డబ్బులు జమ కాలేదు. పిల్లల చదువులు, శుభకార్యాలకు చేతిలో చిల్లి గవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు.

బూర్జ మండలం అల్లెనకు వారాడ రాంబాబు అనే రైతు ఫిబ్రవరి మొదటి వారంలో 84 బస్తాలను అల్లెన ఆర్‌బికెకు ఇచ్చారు. ఈయనకు రూ.1,46,664 చెల్లించాల్సి ఉంది. 25 రోజులు గడుస్తున్నా నేటికీ ఖాతాలో డబ్బులు జమ కాలేదు. ఖరీఫ్‌లో కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులు, నూర్పులు, ట్రాక్టరు అద్దెలు చెల్లింపుల కోసం ఒత్తిడి ఎక్కువ అవసడంతో అప్పు చేసి ఇచ్చారు. మరోవైపు రబీలో వేసిన మినప పంట ఖర్చులకూ అప్పులు చేశారు.

ఇదీ ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చిన రైతుల పరిస్థితి. ఖరీఫ్‌లో తీసుకున్న అప్పులు చెల్లించలేక కొందరు, రెండో పంట కోసం మదుపులు లేక మరికొందరు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

'జీడి'కి గిట్టుబాటు ధర ప్రకటించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు

- సిపిఎం డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జీడి పిక్కలకు ప్రభుత్వం వెంటనే గిట్టుబాటు ధర ప్రకటించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీడి పిక్కల 80 కేజీలు బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గిట్టుబాటు ధర కోసం రైతులు గత సంవత్సర కాలంగా పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర ఇవ్వడం ద్వారా మాత్రమే ఉద్దానం, గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తే పంటకు ప్రోత్సాహం దక్కి విస్తారంగా పంటలు పండిస్తారని, తద్వారా జీడి పరిశ్రమ అభివృద్ధి అవుతుందని వారు వివరించారు. పరిశ్రమ అభివృద్ధితో వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, వలసల నివారించవచ్చని దీంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం జీడి పిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని వారు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పలాస పర్యటనకు వచ్చినప్పుడు రైతుల సంతకాలతో కూడిన మెమోరాండం ఇచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వం చర్చించి గిట్టుబాటు ధర ప్రకటిస్తామన్న హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. ఉద్దానం జీవనాడైన జీడి పంట పండించే రైతుల పక్షాన ప్రభుత్వం ఉంటుందా? లేదా దళారీల పక్షాన ఉంటుందా? అని ప్రశ్నించారు. జీడి పప్పు ధర రోజురోజుకు ఆకాశాన్ని అంటుతుంటే జీడిపిక్క ధర పాతాళానికి పోవడానికి కారణం ఎవరు అని వారు ప్రశ్నించారు. కేరళ మాదిరిగా జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, స్థానిక జీడీ పిక్కలు పూర్తిగా కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ పిక్కలు దిగుమతికి అనుమతించాలని వారు కోరారు. విదేశీ పిక్కలు దిగుమతికి అధిక సుంకాలను పెంచాలని, జీడీ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీడి పంటను రికార్డుల్లో నమోదు చేసి పంట రుణాలు ఇవ్వాలని, భీమా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. జీడి రైతులు చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు.

ఎన్నికల వ్యయంపై నిశిత పరిశీలన

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికలు-2024లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, వీడియో సర్వేలెన్స్, అకౌంటింగ్ టీం సభ్యులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎస్-ఎస్‌టి, విఎస్‌టి, ఎస్ఎస్‌సి అకౌంటింగ్ టీం సభ్యులు సమన్వయంతో, సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని అన్నారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లు నమోదు చేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్వహించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్ ప్రచురణకర్తలు ఎన్నికల ప్రాతినిధ్య చట్టం 127 ఏ ప్రకారం నిబంధనలు పాటించాలని అన్నారు. ఎంసిఎంసి ద్వారా ఎన్నికల్లో ప్రకటనలు జిల్లా మీడియా, అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా డబ్బు, మద్యం పంపిణీ ఫ్లయింగ్ స్క్వాడ్లు ఎస్ఎస్‌టి తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బ్యాంకు లావాదేవీలు రూ.10 లక్షలు మించి నగదు, జమ, ఉపసంహరణ, ఆన్‌లైన్ ద్వారా మల్టిపుల్ లావాదేవీలపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. అన్ని టీమ్‌లు అప్రమత్తతతో పని చేయాలన్నారు. సి-విజిల్ యాప్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సిపిఒ పి ఎస్ఎస్ ప్రసన్నలక్ష్మి, ట్రైనర్లు కిరణ్, ఎన్. బాలాజీ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశాం

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

చంద్రబాబు నాయుడు హామీలన్నీ బూటకమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని అలికాంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలనలో ఎప్పటికప్పుడు మార్పులు వైసిపి ప్రభుత్వం చేస్తుందని అన్నారు. మారిన పరిస్థితులు తగ్గట్టుగా పాలన సంస్కరణలకు రూపకల్పన సిఎం జగన్ చేస్తున్నారని పేర్కొన్నారు. మిగతా ప్రభుత్వాల కన్నా భిన్నమైన పాలన ప్రభుత్వం అందిస్తుందన్నారు. పేదలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని అన్నారు. రాష్ట్రం శ్రీలంక, వెనుజులా అయిపోతుందని, తీవ్ర ఆర్థిక సంక్షోభం వస్తుందని చంద్రబాబు గగ్గోలు పెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు మాట మార్చి జగన్‌కు మించి పథకాలు ఇస్తామని హామీలు గుప్పిస్తున్నారని అన్నారు. దీంతో స్థిరత్వం లేని నేతగా చంద్రబాబు ఇప్పటికే తేలిపోయారన్నారు. 40 ఏళ్ల రాజకీయం అనుభవం కలిగిన చంద్రబాబుకు పేదలు, రైతుల అవసరాలు తెలియవని వ్యాఖ్యానించారు. అధికారంతో దోపిడీ చేయడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. పరిపాలనను ప్రస్తుతం గ్రామస్థాయికి తీసుకొచ్చామన్నారు. 2.7 లక్షల మందికి శాశ్వత గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రూ.12 వేల కోట్లు వెచ్చించి భూమి కొనుగోలు చేసి, 31 లక్షల మందికి సొంత ఇంటి కల సాకారం చేశామన్నారు. సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తం కింద రూ.24 వేలు ఏటా ఇస్తున్నామని అన్నారు. రైతులకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.13,500 ఇస్తున్నామని చెప్పారు. దళారులతో పని లేకుండా పంట ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. వివాదాలకు తావు లేకుండా భూ సర్వే చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, ఎఎంసి చైర్మన్ ముకళ్ల తాతబాబు, చిట్టి జనార్ధనరావు, వైస్ ఎంపిపి బి.చంద్రమౌళి, యజ్జల గురుమూర్తి పాల్గొన్నారు.

రమణయ్య కుటుంబానికి చెక్కు పంపిణీ

విశాఖపట్నంలో ఇటీవల హత్యకు గురైన తహశీల్దార్ సనపల రమణయ్య కుటుంబ సభ్యులకు పెద్దపాడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు రూ. 50 లక్షల చెక్కుని గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్ పాల్గొన్నారు.

నెరవేరిన పేదల సొంతింటి కల

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పరాజు

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం ఏర్పాటై ఐదేళ్లలో రాష్ట్రంలో 34 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందించిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కోసంగిపురం వద్ద నిర్మించిన 912 టిడ్కో ఇళ్లను గురువారం ప్రారంభించి లబ్ధిదారులకు అందించారు. అలాగే 150 ఎకరాల్లో నిర్మితం కానున్న జగనన్న స్మార్ట్ సిటీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పేదలకు ఉచితంగా ఇళ్లు పంపిణీ చేసిన ఘనత లేదని అన్నారు. పంపిణీ చేసిన ప్రతి ఇంటిపైనా లబ్ధిదారులకు రుణాలు ఉన్నాయని అన్నారు. రుణం అనే పరిస్థితి ప్రస్తుతం లేదని పేర్కొన్నారు. పట్టా అందించి ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు ఉచితంగా లబ్ధిదారులకు అందించి ఇళ్ల నిర్మాణం ఈ ప్రభుత్వ హయాంలో చేపడుతున్నామని అన్నారు. టిడ్కో టిట్కో ఇళ్లు రానివారికి పట్టాలు అందించి ఇళ్ల నిర్మాణం చేపట్టంతో వారికి వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం కావడమే కాకుండా, టిడ్కో ఇళ్ల మాధిరిగా రుణం ఉండే అవకాశం లేదన్నారు. పక్కనే 2500 ఇళ్లతో జగనన్న కాలనీ నిర్మించామని అన్నారు. మనం కడుతుంది ఇళ్లు కాదని... ఊళ్లకు ఊళ్లేనని అన్నారు. పన్ను చెలిస్తూ, తెల్లరేషన్ కార్డులేని వారి కోసం తక్కువ ధరకు జగనన్న స్మార్ట్ సిటీలో లేఅవుట్ ద్వారా ఇళ్ల స్థలాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ లేఅవుట్‌లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కలిగి ఉంటాయన్నారు. విశాఖ ఎంవిపికి తలదన్నే అతిపెద్ద లేఅవుట్ పలాసలో తయారు అవుతుందన్నారు. ప్రతిపక్ష నాయకురాలు టిడ్కో ఇళ్ల వద్ద ఫొటోలు దిగి మేమే కట్టించామని ప్రకటనలు చేశారని, మీ హయాంలో ఒక్క గోడ నిర్మించారా? అని ప్రశ్నించారు. వాలంటీర్లు, సచివాల వ్యవస్థలతో నేరుగా మీ ఇంటికే సంక్షేమ పథకాలు వస్తున్నాయని అన్నారు. గతంలో జన్మభూమి కమిటీల వద్ద చేతులు కట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, అది మనకు అవసరమా? అని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్, ఎపి టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, సుడా చైర్మన్ గుప్తా, జిల్లా హౌసింగ్ సొసైటీ అధికారి ఓబిలేష్, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి పాల్గొన్నారు.

పలాస మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డులో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుతో కలిసి మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్ పోతనపల్లి ఉమా, వైసిపి నాయకులు పోతనపల్లి హరి, కౌన్సిలర్లు బోర చంద్రకళ, గుజ్జు జోగారావు, సనపల సింహాచలం, బెల్లాల శ్రీను పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులు సమానమే

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో పురుషులు, మహిళలు అంతా సమానమేనని, అవకాశాలు అందిపుచ్చుకొని మహిళలు మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆకాంక్షించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన గురువారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఎవరిపైనా ఆధార పడకుండా స్వశక్తితో రాణించి సామాజికంగా, ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని చెప్పారు. జూనియర్ మహిళా న్యాయవాదులూ వృత్తిలో క్రమశిక్షణతో సాధించి ఉన్నతంగా ఎదగాలన్నారు. సూర్యారావు మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు ఎంతో గొప్ప గౌరవం ఉందన్నారు. ప్రకృతి వనరులకు సైతం స్త్రీ మూర్తులతో పోలుస్తూ గౌరవిస్తుండడం భారతీయ సంస్కృతిలో భాగమైందన్నారు. మహిళా న్యాయవాది గరిమెళ్ల వెంకట సూర్య ఉమా విశాలాక్షిని దుశ్శాలువతో ఘనంగా సన్మానించి మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో 3వ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, 4వ అదనపు జిల్లా జడ్జి మహేంద్ర ఫణికుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శారదాంబ, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.రాణి, 3వ అదనపు మెజిస్ట్రేట్ డి.శ్రీభరణి, ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షులు చాపర విజయలక్ష్మీబాయి, బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, సీనియర్ న్యాయవాదులు జి.లక్ష్మి, శిష్టు రమేష్, చమళ్ల నర్సింహమూర్తి, సరళాకుమారి, మహిళా ప్రతినిధి వేమూరి హరిప్రియ పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల డిబార్

శ్రీకాకుళం అర్బన్ : ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో భాగంగా గురువారం కోటబొమ్మాళి, నరసన్నపేట కాలేజీల్లో చూసి రాస్తూ ముగ్గురు విద్యార్థులు పట్టుబడ్డారు. మిగిలిన చోట్ల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 83 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 20816 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 19852 మంది హాజరయ్యారు. పరీక్షలకు 983 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ గ్రూపు విద్యార్థులు 19606 మంది రాయాల్సి ఉండగా, 18,666 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1210 మంది హాజరు కావాల్సి ఉండగా, 1167 మంది రాశారు. ఇంటర్ పరీక్షల్లో 3 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐఒ) ప్రగడ దుర్గారావు తెలిపారు.

ఎండల మల్లన్న ముస్తాబు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మహాశివరాత్రి జాతరకు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం రావివలస ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయం శోభామయంగా ముస్తాబైంది. ఈ నెల 8 మహాశివరాత్రి నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 11న స్నానాల ఘట్టంతో ముగుస్తాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా తెలంగాణా రాష్ట్రాల తరలివస్తారు. ఈ ఏడాది మహాశివ రాత్రికి భారీగా యాత్రికులు తరలివస్తారని అంచనా వేశామని అలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు అలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ ఆధ్వర్యాన ఎక్కువగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి పది బస్సులు తిప్పుతున్నట్టు మేనేజర్ తెలిపారు. వైద్య శిబిరాలు, తాగునీటి సదుయం ఉచితంగా ఏర్పాటు చేశారు. ఆర్‌టిసి విద్యుత్, పోలీసు, పంచాయతీశాఖలు సమన్వయంతో యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయ ఆవరణలో సిసి కెమెరాలు అమర్చినట్లు పోలీసులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

నమూనా చెక్కును అందజేస్తున్న విద్యాసాగర్, సూరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళలకు అండగా నిలుస్తూ, వారిని ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిఆర్‌డి పీడీ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. కార్యక్రమంలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పంపిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు. ఈ వైఎస్ఆర్ ఆసరా 4విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసిని కాడ నుంచి ప్రారంభించారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యాన విద్యాసాగర్, కళింగ వైశ్య, తూర్పు కాపు, పొందరకాపు కార్పొరేషన్ల చైర్మన్లు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగో విడత కింద రూ. 332.46 కోట్లను 1,77,314 మంది మహిళల ఖాతాల్లో జమ చేశామని అన్నారు. మహిళలకు ఇటువంటి కార్యక్రమాలు అమలు చేయడం వల్ల సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఒంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జిల్లా సమాఖ్య అధ్యక్షులు మూల కృష్ణవేణి, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రమణ, పొందర కార్పొరేషన్ రాజాపు హైమావతి, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్నారు

ఎస్‌టి కమిషన్ చైర్మన్ ముందు వాపోయిన గిరిజన సంఘ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గిరిజనుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని గిరిజన సంఘ నాయకులు ఎపి ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు ఎదుట తమ గోడు వెల్లబుచ్చారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎస్‌టి కమిషన్ చైర్మన్ బుధవారం సమీక్షించారు. గిరిజనులకు కేటాయించిన నిధులు పక్క దారి పట్టాయని, జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘ నాయకులు కోరారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ రహదారి సౌకర్యం లేక డోలి మోతే శరణ్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకే కేటాయించాలని, ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంలను నియమించాలని, నైట్ వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని విన్నవించారు. అలాగే గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు వెంటాడుతున్నాయని, వాటిని తక్షణ పరిష్కారం మార్గం చూపాలని కోరారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీఇచ్చారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించుకుందామని అన్నారు. అనంతరం స్థానిక పిహెచ్‌సిని సందర్శించారు. ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందితో మాట్లాడి గిరిజనులకు మెరుగైన సేవలు అందించి మన్నలను పొందాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జానకమ్మ, ఐటిడిఎ డిడి ఎస్.ఆదినాయుడు, ఎస్.చొక్కారావు, ఎస్.కృష్ణారావు, లక్ష్మీనారాయణ, జగన్నాయకులు, సవరకుమార్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA.
1.P.2/2021

Between:
S. Vinod Kumar. ---Petitioner.
And:
P. Krupa and another. --Respondents.

NOTICE.

To
R.3: Silla Raju, s/o late Mohana Rao, business, c/o Dhanalaxmi Marbles, 8-2-17, Opp: to S.M.D. Parlour, Kasibugga P.O., Srikakulam District.
R.11: Vysyaraju Murali, s/o Venkataraju, Door No.4-8-32, business, Old Bus Stand, Near: Rotary Club, P.O: Tekkali, Tekkali Mandal, Srikakulam Dist.

Please take notice that the petitioner herein filed the above I.P. against you all before the above court and it stands posted to **14-03-2024 at about 10-30 A.M.** in the above court for your appearance, appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per Law.

K.S. PRASAD BABU,
ADVOCATE, SOMPETA.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA.
O.S.18/2023

Between:
P. Raj Kumar. --Plaintiff.
And:
Tamada Suresh and another. ---Defendants.

NOTICE.

To
D.1: Tamada Suresh, s/o Dharma Rao, cultivation, residing at Door No.3-213, Baipalli village, P.O: Akkupalli, Vajrapukottruru Mandal.

Please take notice that the plaintiff herein filed the above suit for Specific Performance of agreement to sell dated 06-08-2022 and it stands posted to **14-03-2024 at about 10-30 A.M.** in the above court, appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per Law.

B.K.R. PATNAIK
K.S. PRASAD BABU
ADVOCATES, PALASA & SOMPETA.

పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి

జిల్లాలో ప్రతి మహిళ పౌష్టికాహార లోపాన్ని అధిగమించినాడే మహిళ ఆరోగ్యంగా ఉంటారు. మహిళలు విద్యలో ముందుంటే తద్వారా గుర్తింపు వస్తుంది. 14 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య మహిళలు ఎక్కువగా రక్తహీనతకు లోనవుతున్నారు. దీనివల్ల ఆరోగ్యం సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మహిళలు ఉద్యోగం, ఇంటి పనుల వలన విశ్రాంతి తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నారు. నేటి మహిళ అన్ని రంగాల్లోనూ ముందున్నారు. గ్రామీణ ప్రాంతంలో మహిళలు గృహానికే పరిమితం కాకుండా చట్టాలపై అవగాహన పెంచుకుని ముందుకు సాగాలి.

- శాంతిశ్రీ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, శ్రీకాకుళం

అన్ని రంగాల్లో ముందుండాలి

మహిళల్లో చైతన్య స్థాయి పెరిగింది. ఇప్పటికే అన్ని రంగాల్లోనూ మహిళలు ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మహిళలు ముందు వరుసలో ఉండాలి. ప్రత్యేక ప్రతిభావంతులు, మహిళలకు రాయితీపై మూడు చక్రాలు రిక్షాలను అందజేస్తున్నాం. ఈ అవకాశాన్ని మహిళలు ఉపయోగించుకోవాలి. మహిళలపై దాడులు జరిగినప్పుడు సమాచార వ్యవస్థను ఉపయోగించుకుని దాడుల నుంచి రక్షించుకోవాలి.

- కె.కవిత, విభిన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకులు, శ్రీకాకుళం

మహిళా సాధికారత సాధించాలి

మహిళలు శ్రమ దోపిడీ నుంచి 1857లో పోరాడి సాధించుకున్న మహిళా హక్కులనే మార్చి 8 ప్రపంచ మహిళా దినోత్సవంగా మహిళలు జరుపుకోవడం చాలా ఆనందదాయకం. మహిళ తల్లిగా, భార్యగా, అక్క చెల్లెలుగా ఇంటా బయట అన్ని రంగాల్లోనూ ముందు ఉండాలి. కుటుంబంలో ఆడపిల్ల అనగానే చిన్నచూపు చూడకుండా మగవారితో సమానంగా చదివించాలి. విద్య స్త్రీ అభివృద్ధికి చాలా అవసరం. విద్యలో ముందుండాలి.

- ఇ.అనురాధ, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి, శ్రీకాకుళం

మహిళలు స్వశక్తిపై జీవించాలి

మహిళలు తమ కాళ్లపై తాను నిలబడి స్వశక్తితో జీవించాలి. సమాజంలో మహిళలపై ఇప్పటికీ వివక్షత కొనసాగడం బాధాకరం. వివక్షత ఆడపిల్ల పుట్టినప్పటి నుంచే మొదలవుతుంది. దీనిని రూపుమాపాలంటే ప్రతి మహిళ ఉన్నత చదువులు చదవాలి. ఓర్పు, సహనానికి మహిళలకి ఎవరూ సాటిరారు. కొన్ని రకాల విధులు మహిళలు మాత్రమే నిర్వహించగలరు. కుటుంబ నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం కల్పించాలి.

- ఆర్.గడ్డమ్మ, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, శ్రీకాకుళం

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలంటే అన్ని అవకాశాలను అందుపుచ్చుకోవాలి. కుటుంబ బాధ్యతలను నిర్వహించి సమాజంలో గౌరవం పొందాలి. ఇప్పటికీ ఎంతోమంది మహిళలు ఉన్నత పదవిలో, ఉద్యోగాల్లో ఉన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు ఉన్నట్లయితే మహిళా రక్షణ కమిటీల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాల్లోనూ ముందుండాలి.

- వి.ఎస్.ఎస్.ఎల్.ప్రసన్న, ముఖ్య ప్రణాళిక అధికారి, శ్రీకాకుళం

జగన్ హయాంలోనే మహిళలకు గౌరవం

ప్రజాశక్తి- పలాస

సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి హయంలో మహిళలకు అరుదైన గౌరవం దక్కిందని మున్సిపల్ మాజీ కౌన్సిలర్, న్యాయవాది, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి రోనంకి శాంతి కుమారి అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో అమ్మఒడి మొదలుకొని జగనన్న పట్టాల వరకు అన్నీ మహిళల పేరు మీద ఇవ్వడం జరిగిందని, మహిళలపై సిఎం జగన్‌కు ఉన్న అపార గౌరవానికి ఇదే నిదర్శనమన్నారు. అంతేకాకుండా రాజకీయంగా వివిధ కార్పొరేషన్, నామినేటెడ్, ఎమ్మెల్యే, ఎంపీ, సర్పంచ్, ఎంపిటిసి వంటి పదవులు కూడా అధిక శాతం మహిళలకు కేటాయించిన ఘనత జగన్‌కే దక్కిందని, మహిళా దినోత్సవం సందర్భంగా సిఎంకు మహిళల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు.

మహిళలను ప్రోత్సహించాలి

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలంటే సమాజంలో ఉండే అన్ని వర్గాల నుంచి అందరి సహకారం అవసరం. మహిళలు సాధికారతతో ముందుకు వెళ్ళాలంటే ప్రతి మహిళలో ఉండే ప్రత్యక్షమైన నైపుణ్యంతో, ఆర్థిక, సామాజిక వర్గంలో తన భాగస్వామ్యాన్ని ప్రతీ వర్గం నుంచి ప్రోత్సహించి వెళ్లాల్సినం అవసరం ఉంది. శక్తి, సామర్థ్యం, నైపుణ్యత, ఖచ్చితతత్వం, లక్షణాలుండాలి. మహిళను సామాజిక అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తే సమాజం పూర్తిగా అభివృద్ధి చెందుతుంది.

- దానేటి పద్మాజీ, ప్రిన్సిపాల్, కరస్పాండెంట్. సూర్యతేజ కాలేజ్, పలాస

మహిళా అభివృద్ధే దేశాభివృద్ధి

మహిళా అభివృద్ధే దేశాభివృద్ధికి కీలకం కావాలి. మహిళలు అన్నిరంగాల్లో ముందు వరుసలో ఉండాలి. స్త్రీలు జ్ఞాన సంపన్నులు, శ్రమ జీవులు, ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నిరంతరం పాటుపడతారు. మహిళలు అన్ని రంగాల్లో ఆకాశం అంత ఎత్తుకు ఎదిగాలి. దేశ కీర్తి ప్రతిష్టలు నలుదిశలా వ్యాప్తి చేసిన మహోన్నతులు మహిళలు. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన త్యాగాలను మననం చేసుకొనేందుకు ఈ సదస్సులు ఎంతగానో తోడ్పడతాయి.

- తమీమ్ అన్సారీయా, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

మహిళా దినోత్సవం శుభాకాంక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చంద్రకళ

మహిళా దినోత్సవ సందర్భంగా డాక్టర్ చంద్ర కళామల్లేశ్వర్ మహిళలకు శుభాక్షంలు తెలుపుతూ 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తెలిసీ తెలియని వయసున్న పిల్లలకు బైక్ నడిపే సామర్థ్యం ఉండదని, అందువల్ల అటువంటి వారికి ఇవ్వదని సూచించారు. అవగహన లేని డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. వారి వల్ల ఒక్కోసారి రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతారని పేర్కొన్నారు. వారికి వారుగా ప్రమాదానికి గురైన క్షతగాత్రులు గాను, ప్రాణాలు కోల్పోవడం గాని జరుగుతున్నాయన్నారు. అత్యుత్సాహానికి పోయి వాళ్ల భవిష్యత్‌ను చేతులారా తల్లిదండ్రులు పాడుచేస్తున్నారని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులకు పిల్లలపై ప్రేమ ఉండవచ్చుని, కానీ అతిగా ఉండడంతో యుక్తవయసులో సరైన నిర్ణయం తీసుకోలేరని అన్నారు. వివేకానంద చెప్పినట్టు నాలెడ్జి ఈజ్ పవర్ అని చెప్పి పిల్లలను పెంచాలన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి

ఆమదాలవలస : మహిళా దినోత్సవం సందర్భంగా మహిళకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సృష్టికి మూలం మహిళ అని అంబేద్కర్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కాళంగి రేమి రజని, నగర కార్పొరేషన్ కమిషనర్ తమీం అన్సారీయా అన్నారు. శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్, శ్రీప్రగతి మహిళా మండలి కుటుంబ సలహా కేంద్రం సంయుక్తంగా, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీ ఉన్నట్టే, స్త్రీ విజయం వెనుక పురుషుడు ఉంటారని గుర్తించాలన్నారు. విద్యార్థినులు చదువులో రాణించి వివిధ వృత్తుల్లో స్థిరపడేందుకు ప్రయత్నాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిజబుల్ వెల్ఫేర్ ఏడి ఎ.కవిత, డిజిటల్ మీడియా ప్రతినిధి సౌమ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, శక్తి అధ్యక్షులు పైడి రజని, శ్రీప్రగతి అధ్యక్షులు కోట సావిత్రమ్మ, మహిళా వైద్యులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల లెక్చరర్లను 52 మందిని సన్మానించి బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ హాల్‌లో గ్రీన్‌సిటీ, ప్రభుత్వ డిగ్రీకళాశాల సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్ఎయు విసి రజని, ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, గ్రీన్‌సిటీ అధ్యక్షులు బెందాళం వరలక్ష్మి, జెసిఐ చైర్మన్ పాలిశెట్టి మధుబాబు, ట్రెజరర్ లక్ష్మణ్, గణపతి, విజయలక్ష్మి, షారాణి, శ్యామల పాల్గొన్నారు.

నాబార్డు ఆధ్వర్యాన...

నగరంలోని శాంత అనురాగ నిలయంలో నాబార్డు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో డిడిఎం వరప్రసాద్, వైసిబి డైరెక్టర్ ప్రసాదరావు, ఆర్ట్స్ ఎన్.సన్యాసిరావు, విద్య ఫౌండేషన్ ప్రసాద్, కెవికె కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, ఎఆర్ఎస్ ఎ.స్వాతి, పిలుపు ఆర్గనైజేషన్ జి.రవికుమార్, చైల్డ్ వెల్ఫేర్ నుంచి శ్రీదేవి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన..

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో యోగా గురువులకు అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ గురువులు నంబాల్ల కల్పన, రేణుక పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన మహిళా ఎస్‌పి జి.ఆర్.రాధిక కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో...

శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సెషన్స్ జూనియర్ సివిల్ జడ్జి డి.భరణి పాల్గొన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ ఎస్‌పి కృష్ణవేణి, ఒకటి, రెండో డిపోల మేనేజర్లు రమేష్ గంగరాజు, అసిస్టెంట్ డిపో మేనేజర్లు, దక్షిణామూర్తి అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్), ఎల్.ఎస్.నాయుడు ఆపల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.రజని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఆమె బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శంకర్‌నారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ వై.ప్రశాంతి, అధ్యాపకులు ఆదిలక్ష్మి, దుర్గ, స్వర్ణలత పద్మజ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మహిళా దినోత్సవం, ఓటు హక్కుపై గ్రామ సంఘాల విఒఎలు మహిళా సమైక్య భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ సిస్ట్ శ్రీరాములు, ఎపిఎం జి.నారాయణరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని రింపిలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గొందరప్రభ, నారాయణమ్మ, సుశీల, పద్మ, ఎస్.గౌరేష్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి కోసింటి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం మహిళల హక్కుల పరిరక్షణకు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు పి.మధుబాబు, ఎల్.బాలకృష్ణ, ఆర్.ప్రభుచంద్, పొట్నూరు ఆనందరావు, పి.సాయిరాజ్, ఎపిఎం జి.నారాయణరావు, ఎస్.శ్రీరాములు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మహిళతోనే ఉన్నత శిఖరం సాధ్యమని రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి ఫెడరిక్ అన్నారు. పట్టణంలో సమస్త కో-డైరెక్టర్ ధనలక్ష్మి అధ్యక్షతన అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ న్యూట్రిషన్ స్పెషలిస్ట్ డాక్టర్ శేషు, సాహిత్య అకాడమీ డైరెక్టర్ మోహనరావు, అరుణ్ కుమార్, తరుణ్ సాయి, గౌతమ్ నీరజ, లత, సత్య పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ శ్రీనిధి భవనంలో వెలుగు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెలుగు సిసిలు, సిఎఫ్‌లతో ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు రాజేశ్వరి, కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి వరలక్ష్మి, రైతు ఉత్పత్తుల ఎపిఎం అప్పలనరసమ్మ, రేణుక, నాగమ్మ, వెంకటరమణ, సిసిలు, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీ, అణచివేత, పీడన, వివక్ష, నిరంకుశత్వాలకు వ్యతిరేకంగా మహిళల హక్కుల సాధన కోసం నూతన సమాజ సాధనా లక్ష్యంతో సమరశీల సంఘటిత పోరాటాన్ని నిర్మించేందుకు మహిళలు ముందుకు రావాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపునిచ్చారు. మండలం మామిడిపల్లిలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, జిల్లా కోశాధికారి కుత్తుం హేమక్క, మహిళా కార్యకర్తలు ఇందిరా, సీతమ్మ, నీలవేణి, రాజమ్మ, సుజాత, జానకమ్మ, పలు ప్రజా సంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ పాల్గొన్నారు.

పలాస : కుర్చీల ఆట ఆడుతున్న సిసిలు

పొందూరు: కెజిబివిలో వాసవి గ్లోబల్ స్పిరిట్యువల్ కౌన్సిల్ సంస్థ చైర్మన్ బండారు జై ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్నకు మహిళా శిరోమణి అవార్డు-2024ను అందజేసి జ్ఞాపిక, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, నేషనల్ కౌన్సిల్ మెంబర్ బుడ్డెపు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పూసర్ల కృష్ణ, పిఆర్‌ఒ రవీంద్ర, గోవిందరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: శ్రీ శివాని విద్యాసంస్థల్లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి అనురాధ పాల్గొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ అప్పారావు, యాజమాన్య సభ్యులు దుర్గా శ్రీనివాస్, సెక్రటరీ దుర్గా ప్రసాద్ రాజు, జాయింట్ సెక్రటరీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వై. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పోరాటాలతోనే మహిళలకు స్వేచ్ఛ

మాట్లాడుతున్న లక్ష్మి

శ్రీకాకుళం అర్బన్ : పోరాటాల ద్వారానే మహిళలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ దక్కుతుందని, అందుకోసం మహిళలు పోరాటాలు చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి పిలుపునిచ్చారు. నగరంలోని పెద్దరెల్లి వీధిలో ఐద్వా ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో వర్గ పోరాటాల నేపథ్యంలో మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం కోసం చేసిన పోరాటాల ఫలితంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల కోర్కెల దినంగా చరిత్రపుటల్లో నిలిచిందన్నారు. శ్రామిక మహిళలపై శ్రమదోపిడీ, లైంగిక దోపిడీ నానాటికి తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో మహిళలు తమ హక్కుల కోసం పనిభారం నుంచి విముక్తి కోసం స్వేచ్ఛ స్వాతంత్రం కోసం ఆర్థిక సామాజిక పోరాటాల బాటనడవాలన్నారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.లలిత మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన సమయంలో పురుషుల పైనే ఆధారపడే విధంగా మనువాదాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఐద్వా నాయకులు పి.శ్రీదేవి మాట్లాడుతూ మహిళలను వంటింటికే పరిమితం చేసే ఆలోచనలను విడనాడాలన్నారు. నిర్భయ, దిశ వంటి చట్టాలు ఉన్నా మహిళలపై లైంగికదాడులను అడ్డుకట్ట వేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.గణేష్, బి.బలరాం, డి.సూరిడమ్మ, వెంకటలక్ష్మి, జానకి, లక్ష్మీప్రభ, సరస్వతి పాల్గొన్నారు.

సిఐటియులో చేరిన ఎంఇ కార్మికులు

సిఐటియులో చేరిన వారిలో బలరాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని 21 మంది ఇంజినీరింగ్ విభాగం కార్మికులు బిఎంఎస్ నుంచి సిఐటియులో చేరారు. నగరంలోని నాగావళి రివర్ వ్యూ పార్క్ సంఘం సమావేశం నిర్వహించారు. గతంలో బిఎంఎస్‌లో చాలా కాలం పనిచేసి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు)లో చేరినట్టు తెలిపారు. సమావేశంలో పంప్‌హౌస్ వద్ద పనిచేస్తున్న కార్మికులకు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు సదుపాయం కల్పించాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు తీవ్రమైన పనిఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారాంతపు సెలవులు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లోనూ పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కుల్లో పనిచేస్తున్న మహిళలకు కనీస వసతులు లేవని తెలిపారు. సమస్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఎన్.బలరాం, అధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా త్రినాథరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.మణికంఠ, కోశాధికారిగా ఎస్.సురేష్, ఉపాధ్యక్షులుగా పి.శాంతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, సిఐటియు పట్టణ నాయకులు నాయకులు ఆర్.ప్రకాశరావు, ఇంజినీరింగ్ విభాగం వర్కర్స్ గిరిజాశంకర్, బాబూరావు, రాజారావు, జమ్మ, మోహన్, యుగంధర్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి రాధిక

అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ నేరాలు అరికట్టడం సాధ్యమని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. ఎస్‌పి కార్యాలయంలో అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్నెస్ (ఆశ్రా) ఈ నెల 15న ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న సైబర్ నేరాల అవగాహన సదస్సు పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియా కీలకంగా మారుతున్న ఈ తరుణంలో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాలుపడుతున్నారని, అలాంటి వాళ్ల వలలో చిక్కుకోవద్దని సూచించారు. వ్యక్తిగత విషయాల్లో గోప్యత పాటించాలన్నారు. లాటరీలు, బహుమతులు పేరుతో వచ్చే మెసేజ్ లింక్‌లను స్పందించకుండాలన్నారు. ఎవరైనా మోసపోతే 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో స్వచంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న ఆశ్రా ప్రతినిధిలను అభినందించారు. కార్యక్రమంలో ఆశ్ర జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా, శ్రీకాకుళం బార్ అసోసియేషన్ న్యాయవాదులు, లఖినాన. రవికుమార్, కట్టా పార్థసారథి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 144 మంది ఇఇఇ రెండో ఏడాది విద్యార్థులకు ఇంటర్ నెట్ ఆఫ్ తింగ్స్ 'ఐఒటి' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఐఒటి ఉపయోగం మైక్రో పైతాన్, వైర్లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్, ఐఒటి యూజింగ్ బ్లింక్ మొబైల్ ప్లాట్ఫార్మ్ కోడ్ డేటా మోనటరింగ్ యూజింగార్డినో వంటి అంశాలపై వైజాగ్ యాపిల్టన్ ఇన్నోవేషన్స్ నుంచి శిక్షకులుగా హాజరైన కె.బాపూజి, పి. పూర్ణసాయి. సిహెచ్ చైతన్య కుమార్లు తెలియజేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్చడి డాక్టర్ కె.కిరణ్ కుమార్, ఎపిఎస్ఎస్ డిసి స్పాక్ డాక్టర్ వి.అశోక్‌కుమార్, ఇఇ విభాగ కో-ఆర్డినేటర్ జి.అశోక్, సిఎంస్ సెక్షన్ కో-ఆర్డినేటర్ కె.బి.అనూషలు పర్యవేక్షించారని తెలిపారు.

ఆవిడో రైతు నేస్తం

కవిటి: కేవలం తమ బాధ్యతలు తాము నిర్వర్తించడానికే పరిస్థితులు అనుకూలంగా లేని ప్రస్తుత రోజుల్లో కవిటి ఉద్యాన శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం ఉద్యాన శాఖ అదనపు బాధ్యతలు అవలీలగా నిర్వహిస్తూ దిగ్విజయంగా ముందుకు సాగుతున్నారు మండలం ఉద్యాన శాఖ అధికారి పోలాకి మాధవీ లత. నాలుగు మండలాల్లో ఏక కాలంలో బాధ్యతలు ఎలా అంటే.. నిత్యం రైతులతో మమేకమై, వారి సందేహాలను నివృత్తి చేస్తూ, వారికి ఆర్థిక స్వావలంబన కల్పించడంలో ఉన్న సంతోషం తన శ్రమని మరింపించేలా చేస్తోందని చెబుతున్నారు ఆమె. టెక్కలి మండలం రావివలసకు చెందిన మాధవీ లత తండ్రి పోలాకి మోహనరావు ఎల్ఐసి లీగల్ మేనేజరుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేయగా, తల్లి తిరుపతమ్మ గృహిణి. ఇక వైవాహిక జీవితం సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి బెందాలం అరవింద్‌తో పంచుకున్న మాధవీ లత తన వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో తండ్రి, భర్త సూచనలు, సలహాలు, అడుగడుగునా అందించిన అండదండలు మనోధైర్యాన్ని కలిగించాయని చెబుతున్నారు. మరోవైపు నాలుగు మండలాల్లో ఏక కాలంలో బాధ్యతలు నిర్వహిస్తున్నా ఎటువంటి అలసట కనిపించని మాధవీ లత కరోనా సమయంలో కూడా పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించి అధికారులతో శభాష్ అనిపించుకున్నారు. అయితే అప్పటికి తన బాబుకు కేవలం నాలుగు నెలల వయసు మాత్రమేనని, ఓవైపు కరోనా ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ, కుటుంబ బాధ్యతలు చూసుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు తెలిపారు. అయితే వృత్తిరీత్యా ఇవన్నీ సహజమే అంటూ ఆమె చిరునవ్వుతో సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే నాలుగు మండలాల్లో ఏక కాలంలో రైతులతో మమేకమై, వారికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ కలెక్టర్ లాఠకర్ చేతులమీదుగా ఉత్తమ ఉద్యాన శాఖ అధికారిగా అవార్డు కూడా అందుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి మరింత మందికి ప్రేరణగా నిలుస్తారని చెప్పడం అతిశయోక్తి కాదేమో.

జీడి మొక్కను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి మాధవీ లత

దుస్తులను పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

నౌపడ : సంతబొమ్మాళి మండలం భావనపాడులో గురువారం అమ్మా భగవాన్ 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మ భగవాన్ సేవాసమితి సభ్యులు కారాడ చిన్నబాబు ఆధ్వర్యంలో పాదుకాభిషేకం నిర్వహించారు. అనంతరం 160 మంది నిరుపేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఏటా వేడుకలు నిర్వహించి సేవా సమితి ద్వారా నిరుపేదలకు సహాయం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పివి రాజు, వాడరేవు చిరంజీవులు, ఎం.జగదీష్, రామచంద్రరావు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సెర్చ్ వారంట్ లేకుండా తనిఖీలు

ఇచ్ఛాపురం: మంగళగిరిలో జనసేన సిబ్బంది నివసించే అపార్ట్మెంట్‌లో బుధవారం రాత్రి ఎటువంటి సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు సోదాలు చేయడం పట్ల జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షలో భాగంగానే వైసిపి ఇటువంటి ఘటనలకు పాల్పడుతోందన్నారు. రాబోయే రోజుల్లో జనసేన, టిడిపి ఉమ్మడిగా నిర్వహించే బహిరంగ సభల్లో వైసిపి మరిన్ని కుట్రలు పన్నే అవకాశం ఉందని, ఇటువంటి దాడులకు జనసేన భయపడేది లేదన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలం రాపాకలో రామయ్య సంబరాల్లో భాగంగా గురువారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాయుడు కుటుంబాలు మూడు రోజులుగా ఈ సంబరాలను నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

విదేశీ వన్యప్రాణుల స్మగ్లర్ల గుట్టురట్టు

కారులో ఉన్న విదేశీ కోతి

పలాస: విదేశీ వన్యప్రాణులను తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్లను కాశీబుగ్గ అటవీ శాఖ అధికారులు గుట్టు రట్టు చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. టెక్కలి సబ్ డివిజన్ అటవీ శాఖ అధికారి నాగేంద్రరావు, కాశీబుగ్గ అటవీ శాఖ అధికారి ఎ.మురళీ కృష్ణ ఇచ్చిన వివరాల మేరకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన సౌరబ్ మండల్, ధనుంజయ సింగ్, ముకేష్ రాములు స్మగ్లర్లు అస్సాం నుంచి కోల్‌కతా మీదుగా చెన్నైకు ఇన్నోవా కారులో రెండు ఆడ, మగకు చెందిన విదేశీ కోతులు తరలిస్తుండగా పురుషోత్తపురం చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అటవీశాఖ ఉన్నతాధికారుల అధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ పరిధిలో ఊసవానిపేట రైల్వే గేటు సమీపంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం 11-40 సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలిపారు. మృతి చెందిన మహిళ వయసు సుమారు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, ఈమె ఆకుపచ్చ రంగు చీర, చెవులకు దుద్దులు ఉన్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

న్యాయ సాధన సదస్సులో పాల్గొన్న సత్యవతి

ప్రత్యేక హోదా వచ్చే వరకు పోరాటం

ఆమదాలవలస: ఎపికి ప్రత్యేక హోదా వచ్చేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే, పిసిసి ఉపాధ్యక్షు రాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. విజయ వాడలో నిర్వహించే ప్రత్యేక హోదాపై న్యాయపోరాటం సభకు సత్యవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని భావించిందని, విభజన చట్టంలో కూడా పేర్కొందని, అయినప్పటికీ అనంతరం కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా విషయాన్ని పక్కన పెట్టిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జెడి శీలం, గిడుగు రుద్రరాజు, పల్లం రాజు, తులసి రెడ్డితో కలిసి న్యాయసాధన ప్రతిజ్ఞ చేశారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

చట్టాలపై అవగాహన

పొందూరు: బాలకార్మిక, మహిళా, ఫోక్సో వంటి చట్టాలపై విద్యార్థినిలు అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాసంఘం చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న పేర్కొన్నారు. మండలం లోలుగు కెజిబివిలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ విద్యార్థినులు మంచి, చెడుల విచక్షణను గుర్తించి అందుకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షులు బి.మంజుల, ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, న్యాయవాదులు బ్రహ్మాజీ, అశోక్, రాము పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు అవరణలో మండల న్యాయసేవా సంఘం అధ్యక్షురాలు, జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత ఆధ్వర్యంలో జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిపి హరిప్రియ, మహిళా సూపర్ వైజర్ సత్యప్రియ, న్యాయవాది కార్యదర్శి వెలమల అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, పూజారి వాసుదేవరావు, నేతాజీరావు, మమ్మిడి ధర్మారావు, ఎపిజి తిరుపతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి కవిటి టౌన్ లైన్ మైంటేనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కవిటి, కొత్తూరు, గొండ్యాలపుట్టుగ, ప్రగడపుట్టుగ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

గ్రావెల్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండలం జె.ఆర్.పురం పంచాయతీ గరికిపాలెంలో సినిమా హల్ రోడ్డు నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు గ్రావెల్ రోడ్డును ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యాలమ్మగుడికి యాత్రికులు రావడానికి ఇబ్బందులు పడడంతో వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు (బుజ్జి) చొరవతో రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బవిరి రమణ, ఎంపిటి పచ్చిగుళ్ల సాయిరాం, వైసిపి నాయకులు ఇడదాసుల తిరుపతిరాజు, టేకి బ్రహ్మాజీ, పిన్నింటి సత్యంనాయుడు, రాయపురెడ్డి శ్రీను, లక్ష్మణ, కరిమజ్జి నాగభూషణ్, కోల అప్పడదొర, ముద్దాడ రాజశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనందరావు

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కేంద్ర ప్రభుత్వం జీడి పంటను కేంద్ర జాబితాలో చేర్చి గిట్టుబాటు ధర ప్రకటించాలని రైతు సంఘం నాయకులు కె.బాలరాజు, కౌలు రైతుల సంఘం నాయకులు బి.ఆనందరావు డిమాండ్ చేశారు. గురువారం కూర్మనాథపురంలో విలేకరులతో మాట్లాడుతూ సోమనాథ్ కమిటీ సిఫార్సుల మేరకు జీడిపంట పెట్టుబడికి 50 శాతం కలిపి ధర నిర్ణయించాలని చెప్పిన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. లక్షలాది మంది రైతులు సంవత్సర కాలం ఢిల్లీ నడబొడ్డున పోరాటాలు చేసి 750 మంది రైతులు బలిదానాలు పోరాట ప్రతిఫలంగా అన్నిపంటలకు ధరలు నిర్ణయించే ఎంఎస్‌పి చట్టం కోసం హామీ ఇచ్చిన ప్రభుత్వం దాన్ని విస్మరించిందని వారు అవేదన వ్యక్తం చేశారు. వైసిపి, టిడిపి, జనసేన రైతుల పట్ల అభిమానం ఉందని చెప్పుకోవడం కంటే రైతు పోరాటంలో పాల్గొని కేంద్రం దిగి వచ్చేవరకు మద్దతుగా నిలవాలని కోరారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి రుణమాఫీ చేయాలని కోరారు. గత నాలుగేళ్ల నుంచి కరువు బారిన పడిన రైతాంగానికి పంటల భీమా వర్తించకుండా చేసి రైతులను దగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోహనరావు, చింత దాలయ్య, జె.హేమంత్, ధర్మారావు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బెంతు ఒరియాలు

బెంతుఒరియాల ఆందోళన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గత 71రోజులుగా న్యాయమైన డిమాండ్ కోసం అందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గురువారం నియోజకవర్గ స్థాయిలో బెంతు ఒరియాలు భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో తమ కులంలో ఉన్న యువత, మహిళలు అనేక అవకాశాలు కోల్పోయారన్నారు. తమకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సురంగి రాజా కోట నుంచి నాలుగు మండలాల నుంచి వచ్చిన బెంతు ఒరియా భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో బస్టాండ్ జంక్షన్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్ మద్ధతు తెలిపారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నిరసన కార్యక్రమంలో. సుమన్ బిసాయ్, రజని కుమార్ దొలై, దేవరాజు సాహు, శ్రీకాంత్ పురియ్, పాండు బిసాయి, శంకర సాహు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న రామారావు, ప్రకాష్

65 మందికి ఇళ్ల పట్టాలు

ప్రజాశక్తి- కవిటి

పేదల సొంతింటి కలను సిఎం జగన్మోహన్ రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలం లండారిపుట్టుగ సచివాలయ పరిధిలో 65మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ హక్కు పత్రాలు గురువారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, ఏ నాయకుడి ఒత్తిడి లేకుండా, అవినీతి అనే పదమే కనుమరుగయ్యేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిదని అన్నారు. కార్యక్రమంలో రాజపురం సర్పంచ్ ఎస్.జానకిరావు, సనపల శ్రీను, పంచాయతీ కార్యదర్శి మన్మధరావు, విఆర్ఒలు దామోదర్, పూడి కల్పన పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి రమాదేవి

వంశధార నీటిపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పంట భూములకు ప్రధాన సాగునీటి వనరులైన వంశధార నీటిని పంట పొలాలకు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని రైతులపై వ్యత్యాసాలు చూపడం ఏమిటని సరుబుజ్జిలి మండల సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిడిఒ ఎ.రత్నం, ఇఒపిఆర్‌డి ఆనందరావు నివేదికలను చదివి వినిపించి అనంతరం శాఖల వారీగా శాఖాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వంశధార ఇంజినీరింగ్ అధికారి జగదీష్ ఆ శాఖ నివేదిక వినిపిస్తున్నా సమయంలో వంశధార ఎడమ కాలువ ద్వారా నిత్యం నీరు విడుదల చేస్తున్నా అధికారులు ప్రధాన కాలువకు నీరు నిలుపుదల చేయడంలో ఆంతర్యం ఏమిటని మండల ప్రత్యేక ఆహ్వానితులు కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, సలంత్రి ఎంపిటిసి శివాల సూర్యనారాయణ, సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు నిలదీశారు. రైతులు వంశదార నీటిని నమ్ముకొని రబీ సాగు చేస్తున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో నీరు ఆపడం ఏమిటని జెఇని ప్రశ్నించగా ఆయన మౌనం దాల్చారు. సమావేశంలో తహశీల్దార్ జె.రమేష్ బాబు, వైస్ ఎంపిపి శివానందమూర్తి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

మా జీ(వి)తాలతో ఆడుకోవద్దు

- 26 నెలలుగా అందని జీతాలు
- సమ్మె తప్పదంటున్న సిబ్బంది
- 18 పంచాయతీలపై తాగునీటిపై ప్రభావం

ప్రజాశక్తి- కవిటి

26 నెలలుగా జీతాలు లేకుండానే పని చేస్తున్నామని, అదిగో ఇదిగో అంటున్నారే తప్పా తమకు జీతాలు మాత్రం ఇవ్వడం లేదని మండలం బొరివంక, బిజి పుట్టుగ పంచాయతీల పరిధిలో ఉద్దానం మంచినీటి పథకం(సిపిడబ్ల్యు ఎస్) సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు జీతాలు చెల్లించాలని కోరారు. 15 రోజుల్లో తమ సమస్య పరిష్కరించకుంటే సమ్మెబాట తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు బొరివంక పంప్ హౌస్ వద్ద గురువారం తమ నిరసన తెలిపిన సి.పి.డబ్ల్యు.ఎస్ సిబ్బంది విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు అప్పులు చేసి కుటుంబాలు నెట్టుకు వస్తున్నామని, ప్రస్తుతం కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి తమకు న్యాయం చేయాలని వీరు కోరుతున్నారు. కార్యక్రమంలో డి.అప్పలరాజు, ఎల్.నారాయణ, వైకుంఠరావు, ప్రసాద్ తదిరులున్నారు.

నిరసన తెలుపుతున్న మంచినీటి పథకం సిబ్బంది

18 పంచాయతీలపై ప్రభావం..

ఉద్దానం ప్రాజెక్ట్ ఉద్యోగుల సమ్మె చేస్తే ఈ వేసవి సమయంలో సుమారు 18 పంచాయతీల్లో తాగునీటి సమస్య ఏర్పడనుంది. ముఖ్యంగా కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువ మంది ఈ నీటినే కాచి వడగట్టి తాగుతుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్దానం మంచినీటి సరఫరా సిబ్బంది సమ్మె చేస్తే గ్రామాల్లో దాహం కేకలు తప్పవని స్థానికులు అంటున్నారు.

అమలుకాని హామీ

అధికారంలోకి వస్తే ఉద్దానం తాగునీటి సిబ్బంది సమస్యలు పరిష్కరించి, వారికి ఆప్కాబ్‌లో అంతర్భాగం చేస్తానని అప్పటి తన పాదయాత్ర సమయంలో సిఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకూ దానివైపు దృష్టి సారించిన పరిస్థితి కనిపించడం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన నుంచి తమకు చల్లని కబురు అందిస్తారని ఎదురుచూసిన వీరికి నిరాశ తప్పలేదు.

- కె.నీలాచలం, జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి

తక్షణమే తమకు జీతాలు మంజూరు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రజలకు సురక్షిత మంచినీరు అందించే సేవల్లో భాగంగా తమకు ఇంతవరకు ఎటువంటి గుర్తింపు లభించలేదు. చివరికి జీతాలు కూడా అందడం లేదు. తమకు మిగతా ఉద్యోగుల్లా ఇఎస్ఐ, పిఎఫ్ సదుపాయం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

- జోగారావు, కార్యదర్శి

ప్రారంభిస్తున్న కలెక్టర్ మనజీర్ జిల్లానీ సమూన్

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన రెడ్‌క్రాస్ పరిపాలనా విభాగం, నైపుణ్యాభివృద్ధి విభాగ భవనాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజలకు అందుతున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ పరిపాలనా విభాగం నిర్మించడానికి రూ. ముప్పై ఐదు లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.మీనాక్షి, రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్, కె.ఎం.కళ్యాణచక్రవర్తి, పి.శ్రీకాంత్, సతీష్, పెంకి చైతన్యకుమార్, చిన్మయరావు, నంది ఉమాశంకర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

బూర్జ: గర్భిణుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారిణి పావని సూచించారు. గురువారం పిహెచ్‌సిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది 40 రోజులలోపే గర్భిణులను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవగాహన లోపం కారణంగా మహిళలు తాము గర్భవతులమని లేటుగా తెలుసుకోవడం వలన ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన మందులను అందజేయాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ సరోజిని, సిహెచ్ఒ అప్పలస్వామి, ఎంఎల్‌హెచ్‌పిఒ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

బూర్జ: మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి రాజశేఖర్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధిక ఉష్ణోగ్రతల వలన తీవ్ర ఇబ్బందులు ఉంటాయని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పిఒ అలేఖ్య, డిఇఒ వెంకటరమణ, ఫైలెట్ అసిరి నాయుడు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ఇచ్ఛాపురం: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు చాలవరకు నివారించవచ్చని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. గురువారం బెల్లుపడా, ఈదుపురం జంక్షన్ వద్ద వాహన చోదకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నిత్యం ఈ జంక్షన్ వద్ద వాహనాలు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఎస్ఐ ప్రత్యేక దృష్టి సారించారు. అకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

రైతు ఉత్పత్తులను పెంచడమే ధ్యేయం

బూర్జ: రైతుల ఉత్పత్తి, ఉత్పాదుకతను పెంచడమే ధ్యేయమని ఎపిడి గురుమూర్తి అన్నారు. గురువారం మండలంలోని ఓవి పేటలో వెంకట నాయుడు చెరువు ఆయకట్టు రైతులకు ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సహకారంతో ఎపి ఐఎటిపి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐదు శాఖలు కలిసి పని చేస్తాయన్నారు. ఇందులో జల శాఖ, వ్యవసాయ, భూగర్భ జల, మత్స్యశాఖ ఉద్యానవన శాఖలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, గ్రామ సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ.తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు

కోటబొమ్మాళి: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపిదేనని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కన్నేవలస, తర్లిపేట, యలమంచిలి పంచాయతీల్లో ఆయా పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కవిటి రామరాజు, గడ్డవలస నాగభూషణరావు, బొడ్డు అప్పన్న, నేతింటి అప్పలస్వామి, సంపతిరావు వెంకటరమణ, బలగ సూర్యారావు ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వజ్రపుకొత్తూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలను రహదారులకు ఇరువైపులా నాటాలని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకులు కీలు విజయ్‌కుమార్ అన్నారు. ఉద్దాన గోపినాథపురంలో గురువారం తిరుపతి, కర్ని లింగరాజు ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ధనలక్ష్మీ, పార్వతమ్మ, విద్యార్థులచే 30 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను నరికేయడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. సభ్యులు మిన్నరావు, జగ్గారావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి- పొందూరు

నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో తాగు, సాగునీరు, రహదారుల వంటి మౌలిక వసతుల కల్పనే తన ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం రాపాక, దల్లిపేట గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలం రాపాకలో రూ.26.50 లక్షలతో నిర్మించిన పశువైద్య భవనాన్ని ప్రారంభించారు. అలాగే రెడ్డిపేట నుంచి దల్లిపేట మీదుగా మూడు మర్రిచెట్లు వరకూ సుమారు రూ.2కోట్లుతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. అలాగే రాష్ట్రంలో కుల, మత, ప్రాంతీయ భేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి డా.ఎం.కిశోర్, సర్పంచ్ కొంచాడ గిరిబాబు, కంబాపు నీలవేణి, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి పాల్గొన్నారు.

పశువైద్య భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

సూపర్ సిక్స్‌పై ప్రచారం

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

వైసిపికి ఇవే చివరి ఎన్నికలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలో పురుషోత్తపురంలో గురువారం టిడిపి మండల అధ్యక్షులు అంబల రాంబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ, శంఖారావం సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. రవికుమార్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ ద్వారా అందించనున్న పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. విజ్ఞానవంతులైన రాష్ట్ర ప్రజలు రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని త్వరలో జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించి చంద్రబాబు నాయుడును సిఎం చేసి రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిల్లి సిద్ధార్థ, శివ్వాల సూర్యనారాయణ, పల్లి సురేష్, లావేటి పూర్ణరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు, నందివాడ గోవిందరావు, కిల్లి మార్కండేశ్వరరావు, లక్ష్మీ గోవింద పాల్గొన్నారు.

ఒక పూటే పనిచేయించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధి కూలీలతో ఒక పూటే పనిచేయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మలు డిమాండ్ చేశారు. గార మండలం రామచంద్రపురంలో చేపడుతున్న ఉపాధి పనిప్రదేశంలో కూలీలతో గురువారం మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఏడాదికాడాది బడ్జెట్లో కోత విధిస్తున్నారని, అందుకు కూలీలకు పని దినాలు తగ్గిపోతున్నాయని వివరించారు. గతంలో ఇచ్చిన తాగునీటికి, పారలకు, గుణపాలకు పదును పెట్టుకోవడానికి ఇచ్చిన డబ్బులు రద్దు చేయడం అన్యాయమన్నారు. పనిప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని కల్పించి రూ.600 కూలి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కుంచాల విజయ్‌కుమార్, దోమ లలిత, చీపురు అనసూయ, సుంకాన సావిత్రి, ఇనప కుర్తి సత్యవతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింహాచలం

విద్యార్థులకు శిక్షణా తరగతులు


అవగాహన కల్పిస్తున్న చిరంజీవి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పరీక్షల సమయంలో సమయ పాలన పక్కాగా ఉండాలని, అందుకోసం ప్రతి సబ్జెక్టుకీ ఎంత సమయం కేటాయించాలో ముందుగానే జాబితా సిద్ధం చేసుకోవాలని ఇంపాక్ట్ ఇంటర్ నేషనల్ ట్రైనర్ పి.చిరంజీవి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ నెల 18 నుంచి పరీక్షల జరగనున్న నేపథ్యంలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు, పరీక్షలకు బాగా సన్నద్ధమయ్యే చిట్కాలు తెలియజేశారు. ఒక సబ్జెక్టుకు కేటాయించిన సమయంలోగా పూర్తి చేయాలో వివరించారు. ఒక సబ్జెక్టు కోసం చదువుతున్న సమయంలో వేరే సబ్జెక్టు కోసం ఆలోచించకూడదని చెప్పారు. చదివే గదిలో మరే ఇతర సబ్జెక్టు పుస్తకాలు ఉండకూడదన్నారు. ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఆన్సర్ ఎక్కువ కాలం గుర్తుండేలా చదవాలని అన్నారు.

ఆశీలు వేలం ఖరారు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో పురపాలక సంఘ పరిధిలో ఆశీల వేలం పాట మున్సిపల్ కమిషనర్ జి. రవి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ వేలం పాటలో నూక జ్యోతి, పొన్నాడ శ్రీనివాసరావు, బొడ్డేపల్లి దాలినాయుడు పాల్గొన్నారు. బొడ్డేపల్లి దాలినాయుడు బహిరంగ వేలం పాటలో రూ.24 లక్షల 50 వేలకు పాటను దక్కించుకున్నారు. చింతాడ సంత ఆశీల వేలం పాటలో ఎవరూ పాల్గొనలేదని తొందరలోనే మళ్లీ ప్రకటన ఇచ్చి బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, గుత్తేదారులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశీల వేలం

టెక్కలి రూరల్ : మేజర్ పంచాయతీ టెక్కలి ఆశీలు వసూలుకు గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గొండెలి సుజాత అధ్యక్షతన వేల పాట నిర్వహించారు, రోజువారి మార్కెట్ పాట రూ.12,66,05 ఖరారైంది. కారు, బస్సులకు వసూలుకు రూ.33 వేలు కాంట్రాక్టర్ జీరు వెంకటరెడ్డి పాట పాడారని ఇఒపిఆర్‌డి బి.మల్లేశ్వరరావు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని చిట్టివలసలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృంద సభ్యులు కె.శంకరరావు, ఎం.లక్ష్మి, కె.లక్ష్మి స్వయంశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంలో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేయించరాదన్నారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

సోంపేట: స్టేట్ బ్యాంక్ ఖాతాదారులకు బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల సేవలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బారువ డిగ్రీ కళాశాలతో పాటు బారువ పరిసర మత్స్యకార గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బారువ బ్రాంచ్ మేనేజర్ శివ సత్యనారాయణ స్టేట్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న పలు రకాల సేవలపై వివరించారు. భీమ వ్యవసాయ రుణాలు హౌసింగ్ రుణాలు, ఇతర పథకాలను వివరించారు. ప్రతిఒక్కరు ఆర్థిక అక్షరాస్యతను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

సంఘ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృంద సభ్యులు

డ్రోన్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి

డ్రోన్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

ఆధునిక యంత్ర పరిజ్ఞానంపై రైతులకు అవగాహన తప్పనిసరని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సర్వీస్ వైలెట్ ఏసు అన్నారు. గురువారం మండలంలో ఓవిపేటలో డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారిపై అవగాహన కల్పించారు. ఈ డ్రోన్ల వ్యవస్థ ద్వారా రైతులకు ఖర్చు తక్కువ కావడమే కాకుండా, తక్కువ సమయంలో పిచికారి పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ ధనుంజయ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జాతీయ విజ్ఞానశాస్త్ర వారోత్సవాలు

ప్రజాశక్తి- పలాస

మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ ఎగ్సిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించి వివరించారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాసరావు, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, మెహర్ సుధ, కృష్ణవేణిలను ఘనంగా సన్మానించారు. వక్తలు ప్రసంగిస్తూ ఈ ఏడాది సైన్స్ దినోత్సవాన్ని స్వదేశీ విజ్ఞానంతోనే వికసిత భారత్ అనే అంశంపై ప్రాచీన విజ్ఞానశాస్త్ర గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులు ప్రపంచ శాస్త్రవేత్తలుగా తయారవడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న సంతబొమ్మాళి మండల సమావేశం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళ మండల పరిషత్ కార్యాలయంలో 11న ఉదయం 10 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.ఉమా సుందరి ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని కోరారు. అలాగే అధికారులు తప్పనిసరిగా పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. గైరాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు చర్యల కోసం సిఫార్స్ చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి- పలాస

మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో గురువారం ఘనంగా శివరాత్రి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషాధారణ ధరించి నాటకాలు, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి

దశాబ్దాల పాటు పాలన సాగించిన పాలకుల వలన ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబడిందని, దీనిని నిరసిస్తూ ఈ నెల 12న ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సదస్సు నిర్వహించనున్నామని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెజ్జాడ యుగంధర్ అన్నారు. ఈ మేరకు సదస్సు నిర్వహణపై యువత పాత్ర అనే అంశంపై పోస్టర్‌ను గురువారం టెక్కలిలో విడుదల చేశారు. 75 ఏళ్లు గడుస్తున్నా నేటికీ అభివృద్ధి చెందలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ప్రేమ్‌చంద్, మురళీ పాల్గొన్నారు.

డీలర్‌ను వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని లక్ష్మీపురంలో రేషన్ డిపో డీలర్‌ను వెంటనే తొలగించాలని గ్రామస్తులు, యవత డిమాండ్ చేస్తున్నారు. లక్ష్మీపురం, నేదురుపేటకు చెందిన రేషన్ కార్డు లబ్ధిదారులకు గత నాలుగు నెలలుగా బయోమెట్రిక్ వేయించుకొని కందిపప్పు పంపిణీ చేయడం లేదని, ఎండీయూ ఆపరేటర్‌ని, రేషన్ డీలర్‌ను నిలదీశారు. ప్రతి నెల వచ్చిన కందిపప్పును మార్కెట్‌లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, రేషన్ కార్డు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గత నెల 18న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు. గురువారం విఆర్ఒ ఆదేశాలతో లక్ష్మీపురంలో రేషన్ పంపిణీ చేయడంతో గ్రామస్తులంతా రేషన్ పంపిణీ వాహనం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎన్నోసార్లు అక్రమాలకు పాల్పడి రుజువైనప్పటికీ రేషన్ డీలర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ డీలర్‌ను వెంటనే తొలగించాలని గ్రామ పెద్దలు, యవత కోరుతున్నారు.

సేవా దృక్పథం అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరిలో సేవాదృక్పదం అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ పిలుపునిచ్చారు. కళాశాల ఆధ్వర్యంలో చిన్న నారాయణపురంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా శిబిరం ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక చింతన అలవర్చుకోవాలన్నారు. పిఒ కంది గొల్ల వారం రోజుల పాటు నిర్వహించిన సేవాశిబిరం నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో రావివలస ఎంపిటిసి మన్యాల కిషోర్‌కుమార్, అధ్యాపకులు ఎ.రామారావు, డి.వాసుబాబు, వెంకటరావు, శివాజీ, శ్రీరాములు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలో దేవునల్తాడ, పొల్లాడ, సైనూరు పోలింగ్ కేంద్రాలను గురువారం తహశీల్దార్ మామిడి సురేష్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలించారు. దివ్యాంగ ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చే విధంగా ర్యాంపు లేనిచోట ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా తాగునీటి వసతి, మరుగుదొడ్లు సదుపాయం కోసం ఆరా తీసారు. ఈయనతో పాటు డిటి వాయిలపల్లి గిరిధర్, ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ కె.తిరుపతిరావు, విఆర్ఒలు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

జనవరి 27న భీమిలిలో జరిగిన సిద్ధం బహిరంగ సభకు వెళ్తూ ఎచ్చెర్ల మండలం ఫరీధుపేటకు చెందిన అంపోలు చిట్టిబాబు దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారు. వైసిపి తరుపున సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఆయన భార్య అంపోలు కృష్ణవేణికి రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియాను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఫరీధుపేట సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, వైసిపి నాయకులు మొదలవలస కృష్ణ, సత్తారు గోపి, మొదలవలస సతీష్, కోటిపాత్రుని సన్యాసిరావు పాల్గొన్నారు.